

ఆగిపోయిన రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

రోడ్డు ఇంప్రూవ్‌మెంట్ పనులను ఆపేయాలి

● అధికారులను కోరిన కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వనస్థలిపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): రోడ్డును తవ్వారు..మరమ్మతులు మరిచారు శీర్షికతో సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి స్పందించారు. ఈ మేరకు సోమవారం కార్పొరేటర్ కాలనీవాసులు, రోడ్డు పక్కన ఉన్న వాణిజ్య సముదాయాల నిర్వాహకులతో కలిసి నిలిచిపోయిన రోడ్డు ఇంప్రూవ్‌మెంట్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బీఎన్‌రెడ్డినగర్ నుంచి వనస్థలిపురానికి వచ్చే రహదారి పక్కన చేపడుతున్న రోడ్డు ఇంప్రూవ్‌మెంట్ పనులతో ప్రజలకు ఏమాత్రం ఉపయోగం లేదన్నారు. ఈ పనులతో ట్రాఫిక్ సమస్యలు పెరిగాయని దాంతో పాటు డ్రైనేజీ పైప్‌లైన్లు పగిలిపోవడంతో దుర్వాసన వెదజల్లుతుందన్నారు. అదేవిధంగా ఏరియా ఆస్పత్రికి వెళ్లే అంబులెన్స్ రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. వనస్థలిపురం వైపు వచ్చే దారిలో పనులు తక్షణమే ఆపేయాలని డీఈ దామోదర్‌ను కోరారు. కాలనీవాసుల అభిప్రాయం మేరకు, కార్పొరేటర్ ఆదేశాల మేరకు వనస్థలిపురం వైపు వచ్చే దారిలో పనులు తక్షణమే ఆపివేస్తున్నామని, వనస్థలిపురం నుంచి బీఎన్‌రెడ్డినగర్ వైపు వెళ్లే వైపు యథావిధిగా పనులను త్వరితగతిన చేపడతామని డీఈ తెలిపారు.



పారిశుధ్య కార్మికులకు సబ్బులు, నూనెలు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

● తుర్కయంజాల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ

హయత్‌నగర్, జూలై 22(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు నూనెలు, సబ్బులు, రక్షణ పరికరాలను చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని అన్నారు. వర్షాకాలం వచ్చినందున కార్మికులు జాగ్రత్తగా ఉండి విధులు నిర్వహించాలని కోరారు. పరిసరాల పరిశుభ్రతపై అధిక దృష్టి సారించాలన్నారు. త్వరలో కార్మికుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయిస్తామన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ అమరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు మంగమ్మ, హరిత, ఉదయశ్రీ, భాగ్యమ్మ, రవీందర్‌రెడ్డి, ధన్‌రాజ్, మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఈఈ హరీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.



స్మితా సబర్వాల్ వ్యాఖ్యలపై హయత్‌నగర్‌లో
నిరసన తెలుపుతున్న వీహెచ్‌పీఎస్ నేత గోవర్ధన్ తదితరులు

స్మితా సబర్వాల్‌ను సస్పెండ్ చేయాలి

● వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ డిమాండ్

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 22(ఆంధ్రజ్యోతి): సివిల్స్‌లో దివ్యాంగుల కోటాపై ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ చేసిన వ్యాఖ్యలను వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలిమండ్ల గోవర్ధన్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం హయత్‌నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయం వద్ద ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివ్యాంగులను కించపరిచే విధంగా మాట్లాడిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆమెపై దివ్యాంగుల చట్టం 2016 యాక్టు ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఒక ఐఏఎస్ స్థానంలో ఉండి ఇలాంటి మాటలు మాట్లాడడం ఆమెకు తగదన్నారు. వెంటనే దివ్యాంగులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాలస్వామి, మల్లెపాక మల్లేష్, లక్ష్మి, కొండలరావు, బ్రహ్మచారి పాల్గొన్నారు.

స్మితా సబర్వాల్ దివ్యాంగులకు క్షమాపణ చెప్పాలి

ఓల్డ్ మలక్‌పేట, జూలై 22(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న స్మితా సబర్వాల్ ఐఏఎస్ మాటలు దేశంలోని దివ్యాంగుల మనోభావాలు, ఆత్మవిశ్వాసం దెబ్బతీసే విధంగా ఉన్నాయని ఆమె తక్షణమే దివ్యాంగులకు క్షమాపణ చెప్పాలని ప్రముఖ కళాకారిణి డాక్టర్ పద్మావతి డిమాండ్ చేశారు. సోమవారం మలక్‌పేటలోని వికలాంగుల కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఒక రాష్ట్రంలో నకిలీ సర్టిఫికెట్లతో ఐఏఎస్ రాసిన సందర్భంలో వికలాంగులు డాక్టర్లు, ఇంజనీర్లు అవుతారా అన్నారు. రాజ్యాంగం మాకు కల్పించిన హక్కుతో హీరా సింఘాల్ లాంటి వారు ఎందరో ఉన్నత స్థాయిల్లో ఉన్నారని ఒక బాధ్యత గల అధికారిగా ఉన్న స్మిత సబర్వాల్ దివ్యాంగులను చులకనగా చేసి మాట్లాడడం వల్ల వారి ఆత్మవిశ్వాసంపై ప్రభావం పడుతుందన్నారు. దేశంలో వికలాంగుల చట్టాలు సక్రమంగా అమలు కావడం లేదని వాటిని అమలు చేయాల్సిన అధికారులు దివ్యాంగులను చులకనగా చేసి మాట్లాడడం సరికాదన్నారు. వెంటనే స్మితా సబర్వాల్ తన మాటలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తారామతిపేట చోరీ కేసులో ఇద్దరు దొంగల అరెస్టు

● వెండి వస్తువులు, బైక్ స్వాధీనం, రిమాండ్



వెంకటేశ్



గోపి

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తారామతిపేట గ్రామంలో ఇంటి తాళాలు పగులకొట్టి చోరీకి పాల్పడిన ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 91.8 తులాల వెండి వస్తువులతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. తారామతిపేట గ్రామానికి చెందిన మధుచారి ఇంట్లో గత సోమవారం రాత్రి ఇంటి తాళాలు పగులకొట్టి గుర్తు తెలియని దొంగలు బంగారు, వెండి వస్తువులను ఎత్తుకెళ్లారు. దాంతో కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీం, సీసీ కెమెరాల ఆధారంగా ఆధారాలు సేకరించిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. కాగా ఆదివారం సాయంత్రం 4గంటల సమయంలో సాగర్ రింగు రోడ్డు ఎల్బీనగర్ వద్ద అనుమానాస్పదంగా బైక్‌పై వెళ్తున్న వరికుప్పల వెంకటేశ్, బాతుల గోపీని పట్టుకుని స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారించారు. దీంతో తారామతిపేట గ్రామంలో ఇంటి తాళాలు పగులకొట్టి చోరీకి పాల్పడింది తామేనని ఒప్పుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి తెలిపారు. వారి వద్ద నుంచి 91.8 తులాల వెండి వస్తువులతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. బంగారు వస్తువులను గుర్తు తెలియని వ్యక్తులకు అమ్మివేసినట్లు వచ్చిన డబ్బులతో జల్సాలు చేసినట్లు ఇద్దరు దొంగలు చెప్పినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. అనంతరం వారిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

● బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు

● ఆ పార్టీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో తహసీల్దార్లకు వినతి

ఎల్బీనగర్, జూలై 22(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో బీసీలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బీసీ డిక్లరేషన్‌ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం నాయబ్ తహసీల్దార్ ఆదిత్యకు బీజేపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాసం వెంకటేశ్వర్లు, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలలలోపే కులగణన చేసి బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రస్తుతం బీసీలకు ఉన్న 23 శాతం రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని ఇచ్చిన హామీని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే గొల్లకురుమలకు రెండవ దశ గొర్రెల పంపిణీకి సంబంధించిన రూ. 2 లక్షలు లబ్ధిదారుల ఖాతాల్లో జమచేస్తామని ఇచ్చిన హామీని మరచి గొల్లకురుమలను మోసం చేశారని వారు మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను వారం రోజుల్లో అమలుకు చర్యలు ప్రారంభించకపోతే లక్షలాది మంది బీసీలతో అన్ని కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నాలు, నిరసన దీక్షలు చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, కుమ్మరి సెల్ రాష్ట్ర నాయకుడు మల్కాజిగిరి కుమార్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్‌యాదవ్, రాష్ట్ర కార్యదర్శి సంజయ్‌గణపతి, రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి కూతురు మురళి, ఎల్బీనగర్ అసెంబ్లీ కన్వీనర్ పోల్కం ప్రశాంత్ ముదిరాజ్, రాష్ట్ర అధికార ప్రతినిధి రాంపురం శ్రీనివాస్, మహిళా కన్వీనర్ లక్ష్మీప్రసన్న, యువమోర్చా జిల్లా నాయకుడు సిల్వేరి అనీల్‌కుమార్, గడ్డిఅన్నారం డివిజన్ అధ్యక్షుడు దాసరి జయప్రకాష్, ఓబీసీ మోర్చా డివిజన్ అధ్యక్షులు బొమ్మరాజు సందీప్, ఆనంద్‌కుమార్, ఓంకార్, శ్రవణ్‌గౌడ్, ఏనుగు శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కాసం వెంకటేశ్వర్లు, సామ రంగారెడ్డి తదితరులు



అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీందర్‌దత్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ ఓబీసీ మోర్చా నేతలు

అబ్దుల్లాపూర్‌మెట్ : బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల అవకాశం కల్పించాలని బీజేపీ ఓబీసీ మోర్చా డిమాండ్ చేసింది. ఈ మేరకు ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు శ్రీనివాస్, బీజేపీ అధ్యక్షుడు బండిగారవి విష్ణుగౌడ్ ఆధ్వర్యంలో సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీందర్‌దత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విష్ణుగౌడ్ మాట్లాడుతూ బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయకుండా కాంగ్రెస్ పార్టీ కాలయాపన చేస్తోందని ఆరోపించారు. కామారెడ్డిలో నిర్వహించిన ఎన్నికల సభలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకపోతే కలెక్టర్ కార్యాలయాలను ముట్టడి చేసి నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిచారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు పోరెడ్డి నర్సింహారెడ్డి, జిల్లా మహిళ మోర్చా అధ్యక్షురాలు రమాదేవి, మోర్చా ఉపాధ్యక్షుడు రంగ జంగమయ్యగౌడ్, పాపయ్యగౌడ్, అంజయ్య, శ్రావణ్‌చారి, సురేఖ, మాజీ సర్పంచ్ వీరస్వామిగౌడ్, శ్రీలత, సత్యనారాయణగౌడ్, కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో టాయ్‌లెట్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి

● మేయర్ పారిజాతారెడ్డి వెల్లడి

సరూర్‌నగర్, జూలై 22(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో టాయ్‌లెట్ల నిర్మాణం, వాటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి తెలిపారు. ఇప్పటికే బడంగ్‌పేట్ స్కూల్‌లో రూ.20లక్షలతో టాయ్‌లెట్స్ నిర్మాణం చేపట్టామని ఆమె పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు బడంగ్‌పేట్‌లో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న సందర్భంగా డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని టాయ్‌లెట్స్ సమస్యను మంత్రి దృష్టికి తీసుకువచ్చిన సంగతి విదితమే. టాయ్‌లెట్స్ లేనందున బాలికలు మంచినీరు తాగడానికి కూడా ధైర్యం చేయలేకపోతున్నారని, దప్పికతో అలాగే ఉంటున్నారని ఆయన సభాముఖంగా పేర్కొన్నారు. దీనికి స్పందించిన మంత్రి శ్రీధర్‌బాబు కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి టాయ్‌లెట్స్ నిర్మాణం, వాటి నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించాల్సిందిగా కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్, మేయర్ పారిజాతారెడ్డిలను ఆదేశించారు. ఈ క్రమంలో సోమవారం కేఎల్లార్‌తో కలిసి మేయర్ పారిజాతారెడ్డి బడంగ్‌పేట్, బాలాపూర్, మల్లాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. అక్కడ టాయ్‌లెట్స్ పరిస్థితి, వాటి నిర్వహణ తీరును పరిశీలించా రు. ఆయా పాఠశాలల్లో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను బాలికలు, ఉపాధ్యాయులు వారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని 17 ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం నిమిత్తం రూ.25లక్షలు కేటాయించి, ఆ మేరకు కౌన్సిల్ సమావేశంలో తీర్మానం సైతం చేశామని పేర్కొన్నారు. సదరు పనులకు సంబంధించి త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభమయ్యేలా చూస్తామని ఆమె చెప్పారు. మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, అమ్మ ఆదర్శ పాఠశాలలను నిర్మించి అన్ని సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో కృష్ణ, కౌన్సిల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు బాలూనాయక్, మహేశ్వరీజైహింద్‌కుమార్, సుదర్శన్‌రెడ్డి, సంతోషీశ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు యెల్మేటి అమరేందర్‌రెడ్డి, వెంకటాపూర్ మాజీ సర్పంచ్ బొర్ర జగన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బాల్‌నింగని జంగయ్య, బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, గట్టు బాలకృష్ణ, నవారు మల్లారెడ్డి, కొండల్‌గౌడ్, నరహరిగౌడ్, నీరుడి శ్రీరాములు, గుడ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలలోని పరిస్థితులపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుంటున్న పారిజాతారెడ్డి, కేఎల్లార్

తారామతి పేట పంచాయతీ కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని తారామతిపేట గ్రామ పంచాయతీ కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు పడింది. గ్రామ పరిధిలోని భూదాన్ భూమిలో అక్రమంగా ఇంటి నెంబర్లతో పాటు అనుమతులు మంజూరు చేశా డు. దీనిపై స్థానిక తాజా మాజీ ఎంపీటీసీ జిల్లా పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశాడు.

దాంతో విచారణ చేపట్టిన అధికారులు నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి నిబంధనలు అతిక్రమించి భూదాన్ భూము లు అనుమతులు మంజూరు చేశాడని తేలడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో కార్యదర్శిపై అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్‌లో గత గురువారం క్రిమినల్ కేసు నమోదు కాగా సోమవారం కార్యదర్శి రాజేష్‌గౌడ్‌ను సస్పెండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక ఉత్తర్వులు జారీ చేశారు.

బొమ్మలగుడి రోడ్డులో ఆక్రమణల తొలగింపు

● గగ్గోలు పెట్టిన బాధితులు





అక్రమంగా నిర్మించిన ర్యాంపులు,
వ్యాపార సముదాయాల ఎదుట నిర్మించిన షెడ్లను తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

హయత్‌నగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ ఏరియాలోని బొమ్మలగుడి నుంచి స్వాతి రెస్పిడెన్సీ వరకు రోడ్డును ఆక్రమించి నిర్మించిన ర్యాంపులను, షాపుల ఎదుట వేసిన షెడ్లను హయత్‌నగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు సోమవారం తొలగించారు. బొమ్మలగుడి నుంచి డివిజన్ సరిహద్దు వరకు రోడ్డుకు ఇరువైపులా అనేక మంది వ్యాపారులు రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. దీంతో 33 ఫీట్ల రోడ్డు కాస్తా 20 ఫీట్ల వరకు కుంచించుకుపోయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా ఒక వాహనం వస్తే మరో వాహనం ఆగాల్సిన పరిస్థితి నెలకొంది. అనుమతులను అతిక్రమించి రోడ్డు మీద వరకు ఇంటి ర్యాంపులను ఏర్పాటు చేశారు. రోడ్డుపైనే మురుగునీటి సంపుల మ్యాన్‌హోల్స్‌ను కూడా ఏర్పాటు చేశారు. వ్యాపార సముదాయాల ఎదుట సగం రోడ్డును ఆక్రమించేలా భారీ షెడ్లు ఏర్పాటు చేశారు. రోడ్డుపైన నాటిన విద్యుత్ స్తంభాలను ఆసరా చేసుకుని రోడ్డు వరకు నిర్మాణాలు చేపట్టారు. దాదాపు 20 కాలనీలకు ఈ రోడ్డునే ఉపయోగిస్తారు. అంతే కాకుండా తట్టిఅన్నారం, నాగోల్ ప్రాంతాలకు వెళ్లే వారు సైతం ఈ రోడ్డునే ఉపయోగించడం వల్ల రోడ్డు ఎప్పుడు బిజీగా ఉంటుంది. ఇరుకుగా మారిన రోడ్డు వల్ల అనేక ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. స్థానికులు అనేక మార్లు స్థానిక ఎమ్మెల్యేకు, కార్పొరేటర్‌కు, టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎట్టకేలకు సోమవారం టౌన్‌ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ మన్సూర్‌తో పాటు పలువురు సిబ్బంది అక్రమంగా నిర్మించిన ర్యాంపులను, షెడ్లను తొలగించారు.

కనీసం నోటీసులు ఇవ్వకుండా ఏమిటీ దౌర్జన్యం

టౌన్‌ప్లానింగ్ అధికారులు అక్రమంగా నిర్మించిన ర్యాంపులు, షెడ్లు తొలగిస్తుండగా ఇంటి యజమానులు, వ్యాపార సంస్థల యజమానులు అధికారులకు అడ్డుతగిలారు. కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా ఏమిటీ దౌర్జన్యం అంటూ వాగ్వాదానికి దిగారు. రోడ్డు ఎంత వరకు నిర్మిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కడుతున్నప్పుడు ఎందుకు అడ్డు చెప్పలేదని ప్రశ్నించారు. నిర్మాణాలు పూర్తి చేసిన తర్వాత వచ్చి ఇలా కూల్చి వేయడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ మన్సూర్, సిబ్బంది పాల్గొన్నారు.



డా.యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌ను సత్కరిస్తున్న రమణాచారి తదితరులు

యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు సినారె పురస్కారం ప్రదానం

రవీంద్రభారతి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేసిన మహనీయులను స్మరించుకోవడం స్ఫూర్తిదాయకమని ఐఏఎస్ విశ్రాంత అధికారి డా. కేవీ రమణాచారి అన్నారు. సోమవారం తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో రసమయి సంస్థ ఆధ్వర్యంలో జ్ఞానపీఠ పురస్కారగ్రహీత పద్మభూషణ్ డా.సి.నారాయణరెడ్డి 93వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షుడు డా. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు డా.సినారె పురస్కారం ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రమణాచారి లక్ష్మీప్రసాద్‌ను సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. సినారె పురస్కారాన్ని ఆచార్య యార్లగడ్డకు అందజేయడం సముచితమైన నిర్ణయమని అన్నారు. తెలుగు భాష, సాంస్కృతిక వ్యాప్తికి సినారె, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ విశేష కృషి చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో టీఎస్ఐడీసీ మాజీ చైర్మన్ వేణుగోపాలచారి, ఎం.కె.రాము, ఎం.కె.ఆర్.ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

రుణమిస్తామని.. రూ.1.20లక్షలు కాజేశారు

● లోన్ మోసాలకు పాల్పడుతున్న నలుగురు సైబర్ నేరగాళ్ల అరెస్ట్

● నిందితులపై దేశవ్యాప్తంగా 401, తెలంగాణలో 24 కేసులు

● ఢిల్లీలో అరెస్ట్ చేసిన సైబర్ క్రైం పోలీసులు

హైదరాబాద్ సిటీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): లోన్ ఇప్పిస్తామని మోసాలకు పాల్పడుతున్న ముఠాను హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. బిహార్‌కు చెందిన మనీష్ కుమార్(24), ఆకాష్‌కుమార్(24), కుందన్‌కుమార్(28), తెలంగాణకు చెందిన వెంకటేష్ మాన్‌జీ రాథోడ్(21) ముఠాగా ఏర్పడి ప్రముఖ రుణ సంస్థల ప్రతినిధులమంటూ తక్కువ వడ్డీకి లోన్ ఇప్పిస్తామని ప్రచారం చేసుకుంటున్నారు. రుణం కావాలని సంప్రదించిన వారి నుంచి జీఎస్టీ, ఎన్ఓసీ, పెనాల్టీ పేరుతో అందినకాడికి డబ్బులు వసూలు చేసి మోసం చేస్తున్నారు. ధనీ ఇన్‌స్టంట్ పర్సనల్ లోన్ సంస్థలో పనిచేస్తున్నామంటూ బహదూర్‌పురాకు చెందిన వ్యక్తికి రుణం ఇప్పిస్తామని నమ్మించారు. బాధితుడు రూ. 2లక్షల రుణం కావాలని కోరగా, అతడి నుంచి ఆధార్, పాన్, బ్యాంకు ఖాతాల వివరాలు తీసుకున్నారు. ప్రాసెసింగ్ చార్జీలు, జీఎస్టీ, టీడీఎస్, ఎస్‌జీఎస్టీ, లేట్ పెనాల్టీ, క్లియరెన్స్, ఎన్ఓసీ, చెక్ క్లియరెన్స్ చార్జీలు, రీఫండబుల్ అమౌంట్ పేరుతో పలు దఫాలుగా బాధితుడి నుంచి రూ. 1,20,340 వసూలు చేశారు. బాధితుడు ఫోన్ చేయగా స్పందించలేదు. మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సాంకేతిక ఆధారాలతో నిందితులు ఢిల్లీలో ఉన్నట్లు గుర్తించారు. సైబర్ క్రైం ఏసీపీ శివమారుతి ఆధ్వర్యంలో సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రావు, ఎస్ఐ కె.సతీష్‌రెడ్డిల బృందం ఢిల్లీ వెళ్లి నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి 11 ఫోన్లు, 2 ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై దేశవ్యాప్తంగా 401, తెలంగాణలో 24 కేసులు నమోదయ్యాయని సైబర్ క్రైం ఏసీపీ శివమారుతి తెలిపారు.

దేశంలో అంతరించిపోతున్న ఆస్ట్రో ఆసియాటిక్ భాషలు

● ఆ భాషలు మాట్లాడే ఆదివాసీ తెగలపై ఇండో యూరోపియన్ భాషల ప్రభావం

● పారిశ్రామికీకరణ, వలసలే ఇందుకు కారణం ● సీసీఎంబీ తాజా అధ్యయనంలో వెల్లడి

హైదరాబాద్: మనదేశంలో ఆస్ట్రో ఆసియాటిక్(దక్షిణాసియా దేశాల ప్రజల మూల భాషలు) భాషలను మాట్లాడే ఆదివాసీ తెగలు క్రమంగా ఇండో-యూరోపియన్(అస్సామీ, బెంగాలీ, కొంకణీ) భాషల వైపు మొగ్గుచూపుతున్నాయని సీసీఎంబీ నిర్వహించిన జన్యు-భాషాపరమైన అధ్యయనంలో వెల్లడైంది. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్ రాష్ట్రాల్లోని ఆదివాసీ తెగలతో పాటు మనదేశంలో దాదాపు 5%మంది ప్రజలు ఆస్ట్రోఆసియాటిక్ భాషలను మాట్లాడుతారు. 4వేల సంవత్సరాలుగా వీరి భాషలివే. అయితే, క్రమంగా ఈ తెగలపై ఇండో-యూరోపియన్ భాషల ప్రభావం పెరుగుతున్నట్లు సీసీఎంబీ వెల్లడించింది. పారిశ్రామికీకరణ, వలసలు ఇందుకు కారణాలుగా పేర్కొంది. ఈ ధోరణి వల్ల ఆస్ట్రో ఆసియాటిక్ భాష మాట్లాడేవారు పూర్తిగా అంతరించిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఒడిశాలోని భతూడి, భుమ్జి, హో, మహాలీ ఆదివాసీ తెగలు మాట్లాడే భాషలో వస్తున్న మార్పులపై సీసీఎంబీ శాస్త్రవేత్త కుమారసామి తంగరాజ్, లక్నోలోని బీర్బల్ సాహ్ని ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్త నీరజ్‌రాయ్ తాజాగా అధ్యయనం నిర్వహించారు. ఆస్ట్రో ఆసియాటిక్ భాష మాట్లాడే తెగలకు చెందినవారు, ఆ తెగలకు సమీపంలోనే ఉంటూ ఇండో-యూరోపియన్ భాష మాట్లాడే వారి జన్యువులను సరిపోల్చి చూశారు. వీరిద్దరి మధ్య జన్యుభేదం ఉందని నిర్ధారణ అయిందని తెలిపారు. జన్యువులు, భాషకు గల సంబంధంపై సీసీఎంబీ అధ్యయనం నిర్వహించడం ఇదే తొలిసారి. ఈ అధ్యయనం అంతర్జాతీయ జర్నల్ హెలియాన్‌లో ప్రచురితమైంది.

మూడు ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాల స్థలంలో..

ఒకే ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనం

● సమగ్ర శిక్ష జాయింట్ డైరెక్టర్‌కు ఎమ్మెల్యే బలాల ప్రతిపాదనలు

చాదర్‌ఘాట్, జూలై 22(ఆంధ్రజ్యోతి): చంచల్‌గూడలో ఒకే చోట ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు చదువుకోవడానికి వీలుగా అన్ని రకాల సదుపాయాలతో నూతన పాఠశాల భవనం నిర్మాణానికి మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల ప్రతిపాదించారు. ఈ మేరకు ప్రతిపాదనలను సమగ్ర శిక్ష జాయింట్ డైరెక్టర్ రాజీవ్‌కు ఇటీవల సందర్శించిన సందర్భంగా ప్రతిపాదనలను అందజేశారు. చంచల్‌గూడలో ఇప్పటికే ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాల నిర్మాణ పనులు కొనసాగుతున్నందున వాటిలో ఇంకా కల్పించాల్సిన వసతులపై ఎమ్మెల్యే వినతి మేరకు ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ శృతిఓజా స్వయంగా పరిశీలించారు. మూడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలైన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కాలాడేర, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కమేళా కదీం, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల చంచల్‌గూడ, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల చంచల్‌గూడకు వేర్వేరుగా ఇరుకిరుకు గదులతో అరకొర వసతులతో కొనసాగుతున్నాయని, వీటిన్నింటిని విలీనం చేసి జీ+2గా ఒకే పాఠశాల భవనాన్ని నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారు చేశామని ఎమ్మెల్యే తెలిపారు. సుమారు 30గదులతో జీ+2గా అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తూ నూతన హైస్కూల్ భవనం నిర్మించాలన్నదే లక్ష్యంగా ప్రతిపాదనలు తయారు చేయించానని, వీటి నిర్మాణానికి అయ్యే వ్యయంపై అంచనాలను రూపొందించాలని ఆయన జాయింట్ డైరెక్టర్ రాజీవ్‌కు విన్నవించారు. ఇప్పటికే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కాలాడేరలో 130మంది విద్యార్థులు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కమేళా కదీంలో 143 మంది విద్యార్థులు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల చంచల్‌గూడలో 77మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 314 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.



ఇంటర్ ఎడ్యుకేషన్ కమిషనర్ శృతిఓజా, సమగ్ర శిక్ష జాయింట్ డైరెక్టర్ రాజీవ్‌తో సమావేశమైన ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ప్రాథమిక పాఠశాలను వేరుచేయాలి

800 మంది విద్యార్థులతో కిక్కిరిసిపోతున్న మలక్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను వేరుచేసి సమీపంలో ఉన్న ప్రభుత్వ క్వార్టర్స్‌లోకి మార్చేందుకు కూడా ప్రతిపాదనలు తయారు చేయాలని ఎమ్మెల్యే బలాల తెలిపారు. ఉన్నత పాఠశాలలో 500 మంది విద్యార్థులు, ప్రాథమిక పాఠశాలలో 300 మంది విద్యార్థులున్నట్లు సైదాబాద్ డిప్యూటీ డీఈవో రాధకృష్ణ తెలిపారు. హైదరాబాద్ జిల్లా డీఈవో రోహిణి, చార్మినార్, హిమాయత్‌నగర్ మండలాల డిప్యూటీ ఈవోలు నెహ్రూబాబు, విజయలక్ష్మి పాఠశాలలను పరిశీలించిన వారిలో ఉన్నారు.